# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 31 జులై 2024 | www.balagamtv.com | పేజీలు 5


## నేడ రాష్ట్ర గవర్నర్ ప్రమాణస్వీకారం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ గర్నవర్‌గా నియామకమైన జిష్ణుదేవ్ వర్మ బుధవారం పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 5.03 గంటలకు ఆయన గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్టు రాజ్‌భవన్ పేర్కొంది. రెండురోజుల కిందట కేంద్ర ప్రభుత్వం 9 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించిన విషయం తెలిసిందే. జిష్ణుదేవ్ వర్మ 2018 నుంచి 2023 వరకూ త్రిపుర రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పని చేశారు. 1957 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిష్ణుదేవ్ వర్మ జన్మించారు.గతంలో బాడ్మింటన్ అసోషియేషన్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా ఆయన సేవలందించారు. ఈయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన కాగా.. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో పార్టీలో 1990లో చేరారు. ఆయన అప్పటి నుంచి ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. త్రిపుర ప్రభుత్వంలో ఆయన మంత్రిగా విద్యుత్, గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్, ఆర్థిక, ప్రణాళిక, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖల బాధ్యతలను నిర్వర్తించారు.

# వయనాడ్‌లో జలప్రళయం



- భారీగా ప్రాణనష్టం.. 123 మంది మృతి
- మెప్పిడి సమీపంలో విరిగిపడ్డ కొండచరియలు
- చాలామంది గల్లంతు

**బలగం టీవి, తిరువనంతపురం**

కేరళలోని వయనాడ్ జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. మెప్పాడి సమీపంలోని వివిధ ప్రాంతాల్లో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో భారీగా ప్రాణ నష్టం జరిగింది. 123 మంది మృతి చెందారని ప్రభుత్వం ప్రకటించింది. వందలాది మంది మట్టిదిబ్బల కింద చిక్కుకున్నట్లు అధికారులు, పోలీసులు అనుమానిస్తున్నారు. గాయపడ్డ వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు.

కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం, అగ్నిమాపక బృందం, జాతీయ విపత్తు స్పందన దళాలు ఘటనాస్థలానికి చేరుకుని మట్టిదిబ్బలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. అదనపు బృందాలు కూడా వయనాడ్‌కు చేరుకుంటున్నట్టు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మెప్పాడి ముండక్కై ప్రాంతంలో ఇప్పటి వరకు ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. కొండచరియలు విరిగిపడడంతో అనేక నివాసాలు ధ్వంసమయ్యాయి. వెల్లర్మల స్కూల్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. మెప్పాడి ముండక్కై ప్రాంతంలో ఇలాంటి విపత్తను ఇప్పటి వరకు చూడలేదని స్థానికులు తెలిపారు.

ముండక్కైలో అర్థరాత్రి ఒంటి గంటకు, ఆ తర్వాత తెల్లవారుజామున 4 గంటలకు రెండుసార్లు కొండచరియలు విరిగిపడినట్లు స్థానికులు తెలిపారు. 400కు పైగా కుటుంబాలపై ఈ ప్రభావం పడినట్లు పేర్కొన్నారు. చాలా మంది ఆచూకీ తెలియకపోవడంతో వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 16 మందికి మెప్పాడిలోని ఓ ప్రయివేటు మిగితా 3వ పేజీలో

## రోజుకు 2 లేదా 3 పద్దులపైన చర్చ పెట్టాలి

- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రోజుకు 19 పద్దులపై చర్చ పెట్టకుండా.. రోజుకు 2 లేదా 3 పద్దులపైన చర్చ పెట్టాలని కోరుతున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభ ప్రారంభం కాగా, మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సభ కొనసాగిన నేపథ్యంలో శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కేటీఆర్ కీలక సూచన చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే కేటీఆర్ మాట్లాడుతూ ఒకే రోజు 19 పద్దులపై చర్చ జరిపి అప్రూవ్ చేసుకోవాలనే ఉద్దేశంతో మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సభను నడిపారు. సుదీర్ఘ ప్రసంగాలు చేయొద్దన్న శాసనసభ వ్యవహారాల మంత్రి ప్రతిపాదనను అంగీకరిస్తున్నాము. కానీ ఈ సభలో 57 మంది కొత్త సభ్యులు ఉన్నారు.. వారందరూ మాట్లాడాలని అనుకుంటున్నారు. ఇలా రోజుకు 19 పద్దులపై చర్చ పెట్టకుండా.. రోజుకు 2 లేదా 3 పద్దులపైన చర్చ పెట్టాలని కోరుతున్నాం. బుధవారం ద్రవ్య వినిమయ బిల్లు పెడుతున్నారు. ఈ సమావేశాలు అయిపోయాయి. కానీ వచ్చే అసెంబ్లీ, బడ్జెట్ సమావేశాల్లో రోజుకు 19 పద్దులు పెట్టకుండా, 2 లేదా 3 పద్దులపై సావధానంగా చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలి. మంత్రులు కూడా సుదీర్ఘ వివరణ ఇచ్చే అవకాశం ఉంటుంది. వచ్చే సెషన్‌ను అవసరమైతే 20 రోజులు పెట్టాలి. మా వైపు నుంచి తప్పకుండా సహకరిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



## శ్రీశైలం జలాశయం ఏడుగేట్లు ఎత్తివేత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎగువ నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం భారీగా పెరుగుతున్నది. దీంతో అధికారులు ఏడు క్రస్ట్‌గేట్లను 10 అడుగులమేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి నుంచి 19,653 క్యూసెక్కులు, క్రస్ట్‌గేట్ల ద్వారా 2,61,543 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. సుకేశుల నుంచి 1,07,246 క్యూసెక్కుల నీరు విడుదలై సాయంత్రానికి 3,88,460 క్యూసెక్కుల నీరు చేరుకోగా.. రిజర్వాయర్ నుంచి 4,13,178 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైనట్లు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 207 టీఎంసీలుగా ఉన్నది.

కుడిగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 25,684 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి ద్వారా చేసి దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. మరో వైపు శ్రీశైలం జలాశయం డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో శ్రీశైలం రహదారులన్నీ పర్యాటకులతో సందడిగా మారాయి. మరో వైపు రిజర్వాయర్‌కు వరద పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా ఎవరూ వెళ్లొద్దని సీఐ ప్రసాదరావు హెచ్చరించారు.

## రెండో విడుత రైతు రుణమాఫీ నిధులు విడుదల




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రైతు రుణమాఫీ రెండో విడత నిధులు మంగళవారం విడుదలయ్యాయి. అసెంబ్లీ ప్రాంగణంలో కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండో విడుత రుణమాఫీ నిధులను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. రూ. లక్షా నుంచి రూ. లక్షా యాభై వేల లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. రెండో విడతలో 6.4 లక్షల మంది రైతులకు రూ. 6,190 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. తొలి విడుతలో 11.34 లక్షల మంది రైతులకు రూ. 6,035 కోట్లు జమ చేశారు. రుణమాఫీ ద్వారా ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరినట్లు పేర్కొన్నారు. రెండు దశల్లో కలిపి రైతుల ఖాతాల్లో రూ. 12,225 కోట్లను జమ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

రెండు విడతల్లో అత్యధికంగా నల్లగొండ జిల్లాకు రూ. 984.34 కోట్లు విడుదల చేశారు. ఈ రెండు విడతల్లో నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 1,37,430 మంది రైతులు లబ్ది పొందారు. నల్లగొండ జిల్లా తర్వాత నాగర్ కర్నూల్ జిల్లా నిలిచింది. రెండో స్థానంలో నిలిచిన నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండు విడతల్లో 80,395 మంది రైతులు లబ్ది పొందగా, రూ. 583.87 కోట్లు విడుదల చేశారు. మూడో స్థానంలో సంగారెడ్డి జిల్లా నిలిచింది. ఈ జిల్లాకు రూ. 563.99 కోట్ల నిధులు విడుదల చేయగా, 77,951 మంది లబ్ది పొందినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ఇక ములుగు జిల్లాలో 17,788 మంది రైతులకు రూ. 130.94 కోట్లు కేటాయించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో రెండు విడతల్లో రూ. 15.56 కోట్లు విడుదల చేసి 2,799 మందికి లబ్ది చేకూర్చారు. ఇక చివరి స్థానంలో నిలిచిన హైదరాబాద్ జిల్లాలో కేవలం ఏడుగురు రైతులు మాత్రమే లబ్ది పొందారు. తొలి విడతలో ముగ్గురు, రెండో విడతలో నలుగురు రైతులకు లబ్ది చేకూరింది.

## కదిలే బస్సులో మహిళపై డ్రైవర్ లైంగికదాడి

- మరో ఘటనలో స్నేహితురాలిపై యువకుడు లైంగికదాడి
- రాష్ట్రంలో ఒకేరోజు రెండు లైంగికదాడులు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు ఎన్ని కఠిన చర్యలు చేపట్టినా దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో ఒక్కరోజే రెండు లైంగికదాడుల ఘటనలు జరిగి సంచలనం రేపాయి. రన్నింగ్ బస్సులో మహిళపై డ్రైవర్ లైంగికదాడికి పాల్పడగా... మరొకరు స్నేహం ముసుగులో దారుణానికి ఒడిగాట్టారు.

ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వివాహిత తన తొమ్మిదేండ్ల కూతురుతో కలిసి ఏపీలోని ప్రకాశం జిల్లా పొదిలి వెళ్లడానికి హరికృష్ణ ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో సీటు రిజర్వు చేసుకుంది. సోమవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ నుంచి ప్రకాశం జిల్లాకు బస్సు బయల్దేరింది. అర్ధరాత్రి బస్సులోని ప్యాసింజర్లు అందరూ నిద్రిస్తుండగా డ్రైవర్ కృష్ణ ఆ మహిళ వద్దకు వెళ్లి నోట్లో బెడ్‌షీట్ అదిమిపట్టి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. గమనించిన తోటి ప్యాసింజర్లు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దాంతో డ్రైవర్ మార్గ మధ్యలో బస్సు నుంచి దూకి పారిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు బస్సును హైదరాబాద్ తార్నాక ప్రాంతంలో బస్సును ఛేజ్ చేసి పట్టుకున్నారు. మరో డ్రైవర్ సైదయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధిత మహిళను వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై స్నేహితుల లైంగికదాడి

ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై స్నేహితుడు లైంగికదాడి చేసిన ఉదంతం బాధితురాలి ఫిర్యాదుతో బయటపడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి ఓ హోటల్‌కు వెళ్లారు. అప్పటికే బాధితురాలు మత్తులో ఉండగా ఆమెతో వచ్చిన ఇద్దరు స్నేహితులు లైంగికదాడికి పాల్పడ్డారు. కొంత సమయం అనంతరం స్పృహ వచ్చిన వెంటనే బాధితురాలు తన స్నేహితులకు విషయం తెలిపింది. అనంతరం బాధితురాలిని స్థానికంగా ఉన్న హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## త్వరలో రేషన్ కార్డులు జారీ

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అర్హులందరికీ త్వరలోనే రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆగస్టు 1వ తేదీన కేబినెట్ భేటీలో విధివిధానాలు ఖరారు చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో రేషన్ కార్డులపై సన్నబియ్యం ఇవ్వనున్నట్లు వివరించారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారందరికీ రూ.500 సిలిండర్ ఇస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రేషన్ కార్డుపై అడిగిన ప్రశ్నకు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పారు. మంగళవారం పౌరసరఫ రాలశాఖ పద్దులపై వాడివేడి చర్చలు జరిగాయి.

కేసీఆర్ చర్యలతో రాష్ట్రంలో ధాన్యం గణనీయంగా పెరిగిందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. పౌరసరఫరాల శాఖ ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయలేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల కోసం గ్లోబల్ టెండర్లు ఎందుకు పిలవలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సన్నబియ్యం టెండర్లు రద్దు చేశారా? లేదా అని ప్రశ్నలు వేశారు. కొత్త రేషన్ కార్డులు అన్నారు, ఎప్పుడు ఇస్తారని అడిగారు. కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోస్తే సాగు, తాగునీటి ఇబ్బందులు రావని మాజీ మంత్రి గంగుల కమలాకర్ రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చారు.

### కాంగ్రెస్‌కు షాక్

- బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- కేటీఆర్ సమక్షంలో చేరిక

వివరాలు 5వ పేజీలో

### పట్టాలు తప్పిన ముంబయి-హావ్‌డా ఎక్స్‌ప్రెస్

- ఇద్దరు మృతి

వివరాలు 3వ పేజీలో

## గల్ఫ్‌లో తప్పిపోయి.. నిస్సహాయ స్థితిలో..

- దుబాయ్ లో సిరిసిల్ల వాసి ఆదృశ్యం
- ప్రభుత్వ విప్, బలగం టీవి చొరవ, గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి సహకారంతో ఇంటికి





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ఆకెన రవి అనే వ్యక్తి దుబాయ్ వెళ్లి ఆదృశ్యమయ్యాడు. ఇతనితో వెళ్లిన స్నేహితుడు... రవి ఆచూకి లభించకపోవడంతో ఇండియాకు వచ్చేశాడు. కానీ రవి ఈ నెల 17 నుంచి కనిపించకుండపోవడంతో సిరిసిల్ల లో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. రవి కుటుంబ సభ్యులు బలగం టీవీని సంప్రదించడంతో విషయాన్ని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి దుబాయ్ లోని ఇండియన్ ఎంబసీకి రాష్ట్ర ప్రభుత్వ ద్వారా లేఖ రాయించి విచారణ ప్రారంభించారు. షార్జా ప్రాంతంలో రవి ఆచూకి లభించి, నడవలేని స్థితిలో పోలీసులు కనుగొన్నారు.ఇతన్ని ఇండియన్ అసోసియేషన్ లో సురక్షితంగా ఉంచి ఇండియన్ ఎంబసీ అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దుబయ్ లోని గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షులు, సామాజిక సేవలకులు గుండెల్లి నర్సింహులకు రవి విషయాన్ని బలగం టీవి వివరించి.. రవిని షార్జా నుంచి దుబాయ్‌కు తరలించి.. ఎంబసీ అధికారులకు ప్రోడ్యూస్ చేసి.. మిస్సింగ్ కేసును క్లోజ్ చేయించారు. మంగళవారం రాత్రి ఇండియా ఫ్లయిట్‌కు రవిని ఎక్కించున్నారు.బుధవారం ఉదయం హైదరాబాద్ ఎయిర్ పోర్టులో దిగనున్నారు. కుటుంబ సభ్యులు రవిని తీసుకురావడానికి హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్లనున్నారు. తన భర్త స్వదేశానికి రప్పించడానికి చొరవచూపిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు, దుబాయ్ సామాజిక సేవలకులు గుండెల్లి నర్సింహులుకు, బలగం టీవీకి కృతజ్ఞతలు తెలిపారు.

## క్యాన్సర్‌తో ఆరేండ్ల చిన్నారి..

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు..





- చికిత్సకు అడ్డొస్తున్న కడు పేదరికం
- నా బిడ్డను కాపాడండి... ఓ తల్లి ఆవేదన....

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ఓ నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చిపడింది. చక్కగా చదువుకుంటూ ఆడుతూ పాడుతూ ఉండే చిన్నారికి క్యాన్సర్ సోకడంతో మంచానికి పరిమితమైంది. కడు పేదరికంతో తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్ బాట పట్టగా, తల్లి కూలి పనులకు వెళ్తేనే ఇల్లు గడిచే పరిస్థితి, బిడ్డకు క్యాన్సర్ సోకడంతో ఆ పేద కుటుంబం చేతిలో చిల్లిగవ్వ లేక అల్లాడుతూ దాతల కోసం ఎదురు చూస్తూ ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. ప్రభుత్వమో, దాతలో తమను ఆదుకోవాలని ఆ తల్లి ఆవేదనతో వేడుకుంటున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన గజ్జెల దిలీప్ శ్యామల దంపతులకు ఇద్దరు కూతుర్లు. చిన్న కూతురు నయనశ్రీ (6) రెండవ తరగతి చదువుతుంది. అంతవరకు బాగానే ఉన్నా నయన శ్రీ కి అనూహ్యంగా గత 2 నెలల క్రితం ఎడమ చెంప భాగం లో చిన్న గడ్డ ఏర్పడగా,వైద్య పరీక్షల అనంతరం క్యాన్సర్ గడ్డగా నిర్ధారణ అయింది. బిడ్డను దక్కించుకోవాలని అక్కడ ఇక్కడ అప్పులు తెచ్చి రెండు నెలల్లో 3 లక్షల రూపాయలు వరకూ ఖర్చు చేసినప్పటికీ నయం కాలేదు. బిడ్డను దక్కించుకోవాలని డాక్టర్ల సూచన మేరకు ప్రస్తుతం హైదరాబాద్ లోని ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది. మెరుగైన వైద్యం అందించాలంటే దాదాపు 10 లక్షల రూపాయల వరకూ ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో నిరుపేద కుటుంబం తల్లడిల్లుతుంది.చేతిలో చిల్లిగవ్వ లేక అల్లాడుతూ ఆపన్న హస్తం కోసం ఎదురు ఎదురుచూస్తున్నారు. ఎవరైనా దాతలు మానవతా దృక్పథంతో సహాయం చేసి, నా బిడ్డను కాపాడాలని ఆ తల్లి వేడుకుంటుంది.ఎవరైనా దా తలు సహాయం చేయాలనుకుంటే ఫోన్ పే నెం: గజ్జెల శ్యామల- 9492399980,అల్లంపట్ల సాగర్- 9391605627, గజ్జల శ్యామల , అకౌంట్ నెంబర్ : 79060010444, ఐఎఫ్ఎస్సి కోడ్ : SBIN0RRDCGD లో సంప్రదించగలరని కోరారు.

## రాజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే చీర బహుమానం



**బలగం టీవీ, వేములవాడ**

సిరిసిల్ల చేనేత కార్మికుడు నల్ల విజయ్ కుమార్ రాజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే చీరను బహూకరించారు. మంగళవారం సిరిసిల్ల చేనేత కార్మికుడు నల్ల విజయ్ కుమార్ కుటుంబ సమేతంగా రాజన్న ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తాను స్వయంగా నేసిన అగ్గిపెట్టే లో ఇమిడే శాలువా మరియు చీర ను శ్రీ రాజరాజేశ్వర స్వామి ,శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి బహుకరించుటకు ఆలయ ఈఓ కె వినోద్ రెడ్డి కి అందజేశారు. ఆలయ అర్చకులు నేత కార్మికుడు నల్ల విజయ్ కుమార్ దంపతులకు ఆశీర్వదించారు.ఈ కార్యక్రమం లో ఈఓ సిసి ఎడ్ల శివ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.






## విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలి

- విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు..
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

రెసిడెన్షియల్ పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధికి అధికారులు పట్టిష్ట చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట లోని ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, భోజన శాల, డార్మెంటరీ లను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి సమగ్ర అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వం నిర్దేశించిన మెన్యూ ప్రకారం పౌష్టికాహారాన్ని ప్రతి విద్యార్థికి అందించాలని, విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని సకాలంలో అందజేయాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పై రెగ్యులర్ గా చెక్ అప్ చేయాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి





- పోలీస్ వాహనాల నిర్వహణ బాధ్యతాయుతంగా ఉండాలి..
- ఎస్పీ అఖిల్ మహాజన్


**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ అందరికి ఆదర్శంగా ఉండాలని, అదే సమయంలో పోలీస్ వాహనాన్ని చూస్తేనే పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్టను పెరిగే విధంగా వాహనాల నిర్వహణ ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.బుధవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లాలోని పపోలీస్ అధికారుల వాహనాల డ్రైవర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై మాట్లాడుతూ అత్యవసర సమయాలలో పోలీసులు సంఘటనా స్థలాలకు త్వరగా వెళ్లే క్రమంలో డ్రైవర్ల బాధ్యత చాలా ముఖ్యమని, అందుకే ప్రతి ఒక్కరి కంటి చూపు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలోని అన్ని పోలీస్ వాహనాల డ్రైవర్లకు ఎల్.వి ప్రసాద్ సిరిసిల్ల వారి సహకారంతో కంటి వైద్య పరీక్షలు చెపిస్తున్నామని అన్నారు . వైద్య పరీక్షలలో లోపం ఉన్న వారికి అవసరమైన చికిత్స తీసుకునేలా సూచనలు చేయడం జరుగుతుందని అన్నారు.పోలీస్ ఉద్యోగం అత్యవసర సేవలలో ముఖ్యమైనది కాబట్టి డ్రైవర్లంతా అధికారులు సూచించిన విధంగా సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ముందుండాలని అన్నారు .డ్రైవర్లంతా వాహనాలలో ఇంజన్ ఆయిల్ మొదలుకొని, స్పేర్ పార్ట్లు, వాహనాన్ని శుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించడం లాంటి విషయాలలో జాగ్రత్తలు పాటిస్తూ వాహనాన్ని సొంత వాహనంగా చూసుకోవాని అన్నారు.

అనంతరం పోలీస్ స్టేషన్ల వారీగా ఉన్న వాహనాలను కండిషన్ లో ఉంచుతూ, నిర్వహణ సక్రమంగా ఉన్న వాహనాలను గుర్తించి సంబంధిత డ్రైవర్లకు ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించి ప్రసంశ పత్రాలు అందించారు.ఈ కార్యక్రమం లో ఆర్ఐలు మాధుకర్, యాదగిరి, ఆర్ఎస్ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.

## అయోధ్య సరయూ నదిలో జనగామ యువతి గల్లంతు

**బలగం టీవీ , జనగామ**



యూపీ అయోధ్యలోని సరయూ నదిలో జనగామకు చెందిన యువతి గల్లంతయ్యింది. కేంద్రానికి చెందిన తాళ్లపల్లి నాగరాజు, అతని సోదరుడి కుటుంబానికి చెందిన 15 మంది రెండురోజుల కిందట అయోధ్యకు వెళ్లారు. రామ మందిరంతో సహా స్థానిక ఆలయాలను సందర్శించారు. సోమవారం ఉదయం 8 గంటలకు నదీ స్నానం చేసేందుకు సరయూ నదిలో లక్ష్మణ్ ఘాట్‌కు వెళ్లారు. అయితే, భారీ వర్షాల నేపథ్యంలో పై నుంచి ఒక్కసారిగా వరద నీటిని వదలడంతో ఘాట్‌పై వరకు వరద ఉప్పొంగింది. దాంతో ఒక్కసారిగా ఐదుగురు నీటిలోపడిపోయారు. ఇందులో నలుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఇందులో తేజస్విని అనే యువతి మాత్రం వరద నీటిలో కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు బాలిక ఆచూకీ దొరకలేదని కుటుంబీకులు వాపోయారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా.. యూపీ అధికారులతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. బాలిక ఆచూకీ కోసం కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాలిక జాడ కోసం లక్ష్మణ్ ఘాట్ వద్దే పడిగాపులు పడుతున్నారు. తేజస్విని స్థానిక ఏబీవీ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నది.

# మధ్యాహ్న భోజనం ఎలా ఉంది..?

- విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్



**బలగం టీవీ ,వేములవాడ**

పాఠశాలలో అన్ని వసతులు, సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా, మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అని విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం వేములవాడ మండలం చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసారు.తరగతి గదులను, పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏ తరగతిలో ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆరా తీశారు. కిచెన్, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు కార్పొరేట్ ప్రమాణాల స్థాయిలో నాణ్యమైన విద్యా బోధన అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పోలీస్ వాహనాల పాత సామగ్రి వేలం..

- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ, సిరిసిల్ల :**

జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ వాహనాల పాత టైర్లు,బ్యాటరీలు,ఇంజన్ఆయిల్,పాత సామగ్రి వేలం వేయనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ తడూర్ లో 07-08-2024 నాడు ఉదయం 10:00 గంటలకు పోలీస్ వాహనాల పాత సామగ్రి వేలం వేస్తున్నామని, వేలంలో పాల్గొనడానికి ఆసక్తి గల కొనుగోలుదారులు ఆధార్ కార్డు, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో సహా హాజరుకావాలన్నారు.వేలంపాటలో పాల్గనే వారు ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్స్ ఆర్ఐ 91 87126 56428 , సంప్రదించాలన్నారు..



## వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



- 1000 రూపాయలు ,దొంగతనానికి ఉపయోగించిన రాడ్ స్వాధీనం...
- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

దేవాలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తి ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సిరిసిల్ల డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డిపేటపోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ రూరల్ మండలం దుర్శెడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్ కూలి పనితో పాటుగా వ్యాన్ పైన క్లీనర్ గా పని చేసేవాడు అని,యుగేందర్ మద్యానికి, జల్సాలకు అలవాటు పడి వృధాగా డబ్బులు ఖర్చు చేసేవాడు అని అన్నారు. యుగేందర్ జల్సాలకు సరిపడక ఎలాగైనా డబ్బులు సంపాదించాలని దొంగతనలకు అలవాటు పడి 2010 సంవత్సరం నుండి 2018 వరకు కరీంనగర్ పట్టణ పరిధిలో వివిధ దొంగతలు చేయగా పోలీస్ లు జైలుకు తరలించడం జరిగిందని అన్నారు.జైలు నుండి వచ్చిన యుగేందర్ గత శుక్రవారం గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామ శివారులో గల సాయి బాబా గుడిలో,ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులో గల ఎల్లమ్మ గుడిలో, పెద్దమ్మ గుడిలో దొంగతనాలకు పాల్పడ్డాడనీ అన్నారు.కేసు నమోదు చేసిన పోలీసులు మరలా దొంగతనం చేయాలని భావించి,బస్సులో కరీంనగర్ నుండి ఎల్లారెడ్డిపేట కు వస్తున్నాడన్న సమాచారం మేరకు ఎల్లారెడ్డిపేట్ బస్టాండ్ లోఅదుపులోకి తీసుకొని 1000 రూపాయలు,దొంగతలకు ఉపయోగించిన ఐరన్ రాడ్ స్వాధీనం చేసుకోని రిమాండ్ కి తరలించడం జరిగిందనీ,బుద్ధుల యుగేందర్ పై కరీంనగర్ జిల్లాలో 17 కిపైగా కేసులు ఉన్నాయని అన్నారు.ఈ కేసు త్వరగతిన చేధించడంలో కీలక పాత్ర పోషించిన సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, క్లూస్ టీం ఏఎస్ఐ శరత్, సిబ్బంది బాపయ్య, రాజేందర్, శ్రీనాథ్ లను డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమం లో సిఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు రమేష్ బాబుకు లేదు

**మీ స్వంత పార్టీ నాయకులే నిన్ను ఏనాడో మర్చిపోయారు..**

**డీసీసీ ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్**



**బలగం టీవీ , వేములవాడ :**

వేములవాడ ప్రజలతో తనకు కేవలం ఓట్ల బంధమే కాదు ప్రేగు బంధం ఉందని, పెద్ద పెద్ద డైలాగ్ లు కొట్టిన మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు నేడు ఎక్కడ ఉన్నాడని,ప్రేగు బంధం కాస్త చివరికి ప్లేన్(ఫ్లైట్) బంధమే అయిందని, నిజంగా పేగు బంధం విలువ తెలిస్తే నీవు జర్మనీ పోయేవాడివి కాదు అని డీసీసీ ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్ మాట్లాడుతూ మా నాయకులు, వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గంతో పాటు రాజన్న ఆలయం అభివృద్ధి పథంలో దూసుకువెళ్తుందని అన్నారు.మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉండి రాజన్న ఆలయానికి గాని, నియోజకవర్గ అభివృద్ధికి గాని ఒక్క రూపాయి కూడా తేలేని అసమర్థ ఎమ్మెల్యేగా రమేష్ బాబు చరిత్రలో నిలిచాడని, అలాంటి వ్యక్తికి ఇక్కడి అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. ఆయనపై ఎంతో నమ్మకంతో ప్రజలు 3సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గ ప్రజలను, వారి సంక్షేమాన్ని గాలికి వదిలేసి, గాలి మోటార్ ఎక్కి వెళ్లిన రమేష్ బాబు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఎక్కడో ఉండి వేములవాడ అభివృద్ధిపై మాట్లాడటం సరైంది కాదని, దమ్ముంటే ఇక్కడికి వచ్చి జరుగుతున్న అభివృద్ధిని చూడాలని హితవు పలికారు. గత ఏడాది కాలంగా నియోజకవర్గానికి దూరంగా ఉండి, కేవలం వాట్సప్ యూనివర్సిటీకే పరిమితమై సామాజిక మాధ్యమాల వేదికలుగా, అబద్ధాలు ప్రచారం చేస్తున్న రమేష్ బాబును తన సొంత పార్టీ నాయకులే పట్టించుకోవడం లేదని, ఆయన్ను ఏనాడో ఇక్కడి ప్రజలతో పాటు నాయకులు మర్చిపోయారని అలాంటి వ్యక్తి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిపై విష ప్రచారం చేసేలా మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు.ఇప్పటికైనా రమేష్ బాబు తన వైఖరిని మార్చుకొని ప్రజా ప్రభుత్వంపై బురదజల్లడం మానుకోవాలని హితబోధ చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ అడ్డిక జైపాల్ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పెషల్ టీచర్స్ నోషనల్ ఇంక్రిమెంట్స్ సాధనకు మౌన దీక్షకు తరలిరండి



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

స్పెషల్ టీచర్స్, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్ల, స్పెషల్ టీచర్ల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మౌన దీక్షను విజయవంతం చేయడానికి పెన్షనర్ల మరియు 398 స్పెషల్ టీచర్ల సిరిసిల్ల జేఏసీ ఆధ్వర్యంలో దాదాపు 25 మంది రిటైర్డ్ ఉపాధ్యాయులు సిరిసిల్ల నుండి బయలు దేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఒకే జీవో,ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికై,398/- రూపాయల వేతనంపై నియమింపబడి,

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీకి బదిలీ చేయబడిన ప్రత్యేక ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇస్తూ పెన్షన్ బెనిఫిట్ కి ఇవ్వడం జరిగిందని,గత ప్రభుత్వం తెలంగాణలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి సమస్యను దాటవేశారు. కావున నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో స్పెషల్ టీచర్లకు జరిగిన అన్యాయాన్ని సరిచేసి, స్పెషల్ టీచర్లకు రెండు నేషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షన్ కు కలపాలని, సిరిసిల్ల జెఏసి పక్షాన డిమాండ్ చేశారు. పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు డిఏలను ప్రకటించి, వాయిదాలను నగదు రూపంలో చెల్లించాలని కోరారు.ఈ.హెచ్.ఎస్. ద్వారా అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపజేయాలని, అలాగే అన్ని జిల్లాలలో రెండు వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని,మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులు మూడు నెలల్లోనే చెల్లించే ఏర్పాటు చేయాలని, పెన్షనర్ల సమస్యను త్వరితగతిన పరిష్కరించడానికి డైరెక్టర్ స్థాయి అధికారిని నియమించాలని,ప్రత్యేకంగా పెన్షనర్స్ డైరెక్టరేట్ ను ఏర్పాటు చేయాలని,కమ్యూటేషన్ విలువ తిరిగి చెల్లించే కాలన్ని తదితర సమస్యల పరిష్కార దిశగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.మధుకర్ రావు, ఏ.రాజేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు,ఆనంద రెడ్డి, ఈ.దేవయ్య,శనిగరం అశోక్, బి.ఆనంద్,గాజుల ప్రతాప్, ఏ.హనుమంత రెడ్డి,కే.రమేష్, ఎండీ.రియాజుద్దీన్,ఎస్.రాధా కిషన్,ఎస్.రాజేశ్వరరావు, ఎస్.రామారావు,డి.రాజన్న, సిహెచ్.జనార్దన్, ఎస్.రామారావు, టి.అంజయ్య,ఎస్.భాస్కర్, పి.గోవర్ధన్,ఎస్ భూమ్ రావు, బి.దేవరాజం తరలి వెళ్లారు .

# వయనాడ్‌లో జలప్రళయం



(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

### సీఎం పినరయి విజయన్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోడీ

ఈ ప్రమాద ఘటనపై కేరళ సీఎం పినరయి విజయన్‌కు ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, ఇతరత్రా యంత్రాగమంతా సహాయక చర్యల్లో నిమగ్నమైనట్లు వెల్లడించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రధాని ఆదేశించారు.

ఈ విలయంలో చూరల్ మాలా పట్టణం సగం వరకూ తుడిచి పెట్టుకుపోయినట్లు స్థానిక మీడియా నివేదించింది. చూరల్ మాలాలో బ్రిడ్జ్ కూలిపోవడంతో సుమారు 400 కుటుంబాలు అక్కడ చిక్కుకుపోయాయి. వరద కారణంగా రోడ్లు, వంతెనలు సైతం పూర్తిగా కొట్టుకుపోయాయి. దీని వల్ల రెస్క్యూ ఆపరేషన్స్ నిలిచిపోయాయి.వయనాడ్ విలయానికి చెందిన వీడియోలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తీవ్రంగా ప్రవహిస్తున్న నీటిలో ఓ కారు కొట్టుకుపోయింది. ముందక్కాయిలో ఉన్న ఓ మదరసాలో 150 మంది చిక్కుకున్నారు. 4 గంటల్లోనే మూడుసార్లు కొండచరియలు విరిగిపడడంతో.. రోడ్లు, బ్రిడ్జ్‌లు కొట్టుకుపోయాయి. రైల్వే లైన్లు కూడా దెబ్బతినడంతో.. రైలు సర్వీసులను అధికారులు ఎక్కడికక్కడ నిలిపివేశారు.

# పట్టాలు తప్పిన ముంబయి-హావ్‌డా ఎక్స్‌ప్రెస్

- 18 బోగీలు బోల్తా
- ఇద్దరు మృతి, 20మందికి గాయాలు





బలగం టీవి , రాంచీ

జార్ఖండ్‌లోని సెరైకెలా-ఖారవాన్ జిల్లాలో మంగళవారం తెలవారుజామున హౌరా-ముంబై మెయిల్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పడంతో ఇద్దరు ప్రయాణికులు మరణించారు. మరో 20 మంది గాయపడ్డారు. ఆగ్నేయ రైల్వేలోని చక్రధర్‌పూర్ డివిజన్ పరిధిలోకి వచ్చే బారాబంబూ సమీపంలో తెల్లవారుజామున 3.45 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. జంషెడ్‌పూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. సమీపంలోనే మరో గూడ్సు రైలు కూడా పట్టాలు తప్పిందని, అయితే ఈ రెండు ప్రమాదాలు ఒకేసారి జరిగిందీ లేనిదీ తెలియరాలేదని ఆగ్నేయ రైల్వే అధికార ప్రతినిధి ఓం ప్రకాష్ చరణ్ విలేకరులకు తెలిపారు. హావడా-ముంబై మెయిల్ ప్రమాదంపై దర్యాప్తునకు రైల్వే ఆదేశించినట్లు ఆయన చెప్పారు.

బారాబంబూ సమీపంలో హౌరా-ముంబై మెయిల్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పడంతో ఇద్దరు వ్యక్తులు మరణించారని, మరో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారని పశ్చిమ సింగ్‌భం డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ చౌదరి ప్రమాద స్థలి వద్ద విలేకరులకు తెలిపారు. హౌరా-ముంబై మెయిల్ ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొందని ఆయన వెల్లడించారు. క్షతగాత్రులకు బారాబంబూలో ప్రాథమిక చికిత్స అందచేసి మెరుగైన చికిత్స కోసం చక్రధర్‌పూర్‌కు తరలించినట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను రైల్వే శాఖ ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ. 1 లక్ష చొప్పున పరిహారాన్ని ప్రకటించినట్లు చక్రధర్‌పూర్ సీనియర్ డిసిఎం తెలిపారు. సహాయక చర్యలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

# పల్లా వర్సెస్ మంత్రి తుమ్మల

బలగం టీవి , హైదరాబాద్

శాసనసభలో రైతు బంధు, పంట భరోసాపై శాసనసభలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి తుమ్మల మధ్య వాడివేడిగా చర్చ సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల ఆత్మహత్యలపై ఒక్క మంత్రి కూడా ఇప్పటివరకు స్పందించలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వ్యవసాయేతర భూములకు గత ప్రభుత్వం రూ.25 వేల కోట్ల రైతుబంధు సాయం ఇచ్చిందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ చేపడతామన్నారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన పథకాలన్నింటినీ మళ్లీ ప్రారంభిస్తామని ప్రకటించారు. రైతుబంధు సమితి అధ్యక్షుడుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి పేరు వచ్చినప్పుడు సూటబుల్ కాదని చెప్పానని గుర్తు చేశారు

# బీసీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం..



- బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడాపు వెంకటేష్

బలగం టీవీ,సిరిసిల్ల :

2.96 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు కేవలం 9,200 కోట్లు మాత్రమే కేటాయించడం, రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా ఉన్నటువంటి బీసీలను మోసం చేయడమే అవుతుంది అని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడాపు వెంకటేష్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లోని హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సిరిసిల్లలోని కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నంద్యాడాపు వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని పెంచలేదని, స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని, ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్స్, మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.గొల్ల కురుమలకు అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీ కి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని ఎకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారని అన్నారు. బీసీ సబ్ ప్లాన్ కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హెూదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ఏడాదికి 20వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ, ఇచ్చి 8 నెలలు గడుస్తున్న నిధుల విషయం పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదు అని అన్నారు.

ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదు అని,అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మరియు ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా, పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారు అని అన్నారు.

బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేస్తున్నారని అన్నారు.వెంటనే బడ్జెట్లో బీసీ డిక్లరేషన్ అమలుకు అవసరమైన 50 వేల కోట్ల రూపాయలు కేటాయించి ఖర్చు చెయ్యాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల ప్రాతినిధ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్ .అల్లాడి రమేష్, వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ నాయకులు దాసరి శ్రీనివాస్, గుండెల్లి వేణుగోపాల్,రాజం ప్రకాష్ యాదవ్,ఆడేపు రవీందర్,శీలం రాజు,సిరికొండ శ్రీనివాస్,బూర శేఖర్ గౌడ్,మీస సంజీవ్,బర్కం లక్ష్మీ,నవీన్ యాదవ్,రేగుల సంతోష్ బాబు,అంజా గౌడ్. అంజా గౌడ్ వెన్నమనేని శ్రీధర్ రావు. దేవేందర్ రెడ్డి,గుట్ట రామచంద్రరావు,పీ .రాకేష్ బీజేపీ నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి సాంస్కృతిక సారథి కళాకారుల పాలాభిషేకం



బలగం టీవీ , సిరిసిల్ల

తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులకు పిఆర్ఎస్ తో కలిపి జీతం రావడానికి సంతోషిస్తూ సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో రోజులుగా సాంస్కృతిక సారథి కళా కారులు ఎదురు చూస్తున్న పి ఆర్ సి తో కలిపి జీతం మంగళవారం రావడం తో రాష్ట్రంలో ఉన్న 583 కళా కారుల కుటుంబాల్లో పండగ వాతావరణం ఏర్పడింది అని అన్నారు.తెలంగాన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, 6 గ్యారంటీలు మరియు పచ్చదనం పరిశుభ్రత పై పల్లె పట్టణాల్లో కళా ప్రదర్శనలు చేస్తూ,నెలకు 25 రోజులు పని చేస్తు ప్రభుత్వానికి ప్రజలకు వారధి గా ఉన్నా మని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరియు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కే కే మహేందర్ రెడ్డి లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములోరాజన్న సిరిసిల్ల జిల్లా సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడమల శ్రీధర్ రెడ్డీ,కళా కారులు శ్రీరాముల రామచంద్రం,గడ్డం దేవయ్య,గడ్డం శ్రీనివాస్,పొత్తూరి రాజు,వంతడ్పుల ఝాన్సీ,గుగ్గిళ్ల పర్శరాములు,వంతడ్పుల గణేశ్,పూడూరి సంజీవ్ ,కిన్నెర శ్రీలత అనుముల శిరీష అంతడ్పుల లావణ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గడ్డం నర్సయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలి రవీందర్ కళా కారులు ఆకునూరి దేవయ్య, కమ్మరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వయనాడ్ విలయం













# ఇండియా సూపర్ విక్టరీ




- మూడో టీ20లో శ్రీలంకపై భారత్ ఘన విజయం
- సూపర్ ఓవర్‌లో తేలిన ఫలితం
- మ్యాచ్‌ను మలుపు తిప్పిన రింకూ..
- 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

**బలగం టీవి, స్పోర్ట్స్ బ్యూరో**

శ్రీలంకపై భారత్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. దాంతో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా 3-0తో టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. మంగళవారం ఉత్కంఠగా సాగిన ఆఖరి టీ20లో టీమిండియా సూపర్ ఓవర్‌లో గెలుపొందింది.

టీమిండియా పార్ట్ టైమ్ స్పిన్నర్స్ రింకూ సింగ్, సూర్యకుమార్ యాదవ్ సంచలన బౌలింగ్‌తో ఓడిపోవాల్సిన మ్యాచ్‌లో భారత్‌కు అద్భుత విజయాన్నందుకుంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 137 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్(37 బంతుల్లో 3 ఫోర్లతో 39)తో పాటు రియాన్ పరాగ్(18 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 26), వాషింగ్టన్ సుందర్(18 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 25) కీలక ఇన్నింగ్స్ ఆడారు.శ్రీలంక బౌలర్లలో వానిందు హసరంగా(2/29) రెండు వికెట్లు తీయగా.. మహీష్ తీక్షణ(3/28) మూడు వికెట్లు పడగొట్టాడు. చామిందు విక్రమిసంఘే, అసితా ఫెర్నాండో, రమేష్ మెండీస్ తలో వికెట్ తీసారు.



అనంతరం లక్ష్యచేధనకు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 137 పరుగులు చేసింది. దాంతో మ్యాచ్ టై అయ్యి సూపర్ ఓవర్‌కు దారి తీసింది. శ్రీలంక బ్యాటర్లలో కుశాల్ మెండీస్(41 బంతుల్లో 3 ఫోర్లతో 43), కుశాల్ పెరీరా(34 బంతుల్లో 5 ఫోర్లతో 46), పాతుమ్ నిస్సంక(27 బంతుల్లో 5 ఫోర్లతో 26) రాణించారు. భారత బౌలర్లలో రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్, సూర్యకుమార్ యాదవ్ రెండేసి వికెట్లు తీసారు.

శ్రీలంకకు ఓపెనర్లు పాతుమ్ నిస్సంక, కుశాల్ మెండీస్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు.పాతుమ్ నిస్సంకను రవి బిష్ణోయ్ ఔట్ చేసినా.. కుశాల్ పెరీరాతో కలిసి కుశాల్ మెండీస్ ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 52 పరుగులు జోడించారు. అనంతరం కుశాల్ మెండీస్‌ను బిష్ణోయ్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. క్రీజులోకి వచ్చిన హసరంగా(3), చరిత్ అసలంక(0)లను సుందర్ వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చాడు.

### మలుపు తిప్పిన రింకూ సింగ్..

19వ ఓవర్‌ను రింకూ సింగ్‌కు సూర్య ఇచ్చి ఆశ్చర్యపరిచాడు. ఆచితూచి ఆడుతున్న కుశాల్ పెరీరాను రింకూ సింగ్ రిటర్న్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అదే ఓవర్ చివరి బంతికి రమేశ్ మెండీస్(3)ను కూడా ఔట్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. ఆఖరి ఓవర్‌లో శ్రీలంక విజయానికి 6 పరుగులు అవసరమవ్వగా.. సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్‌కు దిగాడు. తొలి బంతిని డాట్ చేసిన అతను తర్వాతి రెండు బంతుల్లో వరుసగా వికెట్లు తీసాడు. కామిందు మెండీస్(1)తో పాటు తీక్షణను(0)పెవిలియన్ చేర్చాడు. నాలుగో బంతికి అసితా ఫెర్నాండో సింగిల్ తీయగా.. విక్రమ సింఘే చివరి రెండు బంతుల్లో క్విక్ డబుల్స్ తీసి మ్యాచ్‌ను టై చేశాడు. రనౌట్ చేసే అవకాశాలను భారత ఆటగాళ్లు చేజార్చారు. దాంతో సూపర్ ఓవర్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### సూపర్ ఓవర్ సాగిందిలా....

వైడ్‌తో సూపర్ ఓవర్‌ను ప్రారంభించిన వాషింగ్టన్ సుందర్.. తొలి బంతికి సింగిల్ ఇచ్చాడు. తర్వాతి రెండు బంతుల్లో కుశాల్ పెరీరా(0), పాతుమ్ నిస్సంక(0) లను క్యాచ్ ఔట్ చేసి శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరదించాడు. మూడు పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. తీక్షణ వేసిన తొలి బంతినే కెప్టెన్ సూర్య బౌండరీ తరలించి విజయలాం ఛనాన్ని పూర్తి చేశాడు.

# చరిత్ర సృష్టించిన మనూ భాకర్



- భారత్‌కు రెండో మెడల్

**బలగం టీవి, స్పోర్ట్స్ బ్యూరో**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్ మనూ భాకర్ చరిత్ర సృష్టించింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా ఆమె రికార్డు క్రియేట్ చేసింది.

10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు కాంస్య పతకం లభించింది. మిక్స్‌డ్ టీమ్‌లో మనూ భాకర్‌తో పాటు సరబ్‌జోత్ సింగ్ ఉన్నారు. కొరియా జంటపై భారత షూటర్లు మేటి ఆటను ప్రదర్శించారు. ఈ మెడల్‌తో షూటర్ మనూ భాకర్ సరికొత్త చరిత్ర సృష్టించింది. స్వతంత్ర భారత్‌లో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన అథ్లెట్‌గా మనూ భాకర్ నిలిచారు. మనూ-సరబ్‌జోత్ జ్యోడి ఆరంభంలో తడబడ్డా.. రెండో సిరీస్ నుంచి అద్భుత ఆటను ప్రదర్శించారు. దాదాపు ప్రతి రౌండ్‌లో ఆధిపత్యాన్ని చాటారు. వాస్తవానికి కొరియా చాలా బలమైన ప్రత్యర్థి. కానీ మనూ ప్రతి రౌండ్‌లోనూ కీలకమైన పాయింట్లను సాధించారు. 16-10 పాయింట్లతో మనూ భాకర్ టీమ్ .. కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నది.

ఇదే ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్ ఈవెంట్‌లో మనూ భాకర్ .. కాంస్య పతకాన్ని గెలుచుకున్న విషయం తెలిసిందే. యావత్ దేశం గర్వించదగ్గ రీతిలో మనూ తన ట్యాలెంట్ ప్రదర్శించారు.

## ఐర్లాండ్‌పై భారత్ ఘన విజయం

**బలగం టీవి, స్పోర్ట్స్ బ్యూరో**



ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు రెండో విజయం నమోదు చేసింది. మంగళవారం పూల్‌బిలో భాగంగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-0 గోల్స్ తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ఇప్పటి వరకు లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు ఆడిన భారత్ రెండు విజయాలు, ఒక డ్రాతో నాకౌట్ అవకాశాలను మరింత మెరుగు పరుచుకుంది. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. అయితే ఐర్లాండ్ కూడా మెరుగైన ప్రదర్శనతో అలరించింది. భారత్ వంటి బలమైన జట్టుకు గట్టి పోటీ ఇచ్చింది. కానీ పటిష్టమైన భారత డిఫెన్స్ దాటుకుని గోల్స్ సాధించలేక పోయింది. ఇక భారత్ విజయంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్ సాధించి జట్టును గెలిపించాడు. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లను బెల్జియం, ఆస్ట్రేలియాలతో ఆడనుంది.

## ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ముందుకు రావాలి

**బలగం టీవి, హైదరాబాద్**



సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరిస్తూ.. పరిశ్రమలోకి ప్రభావవంతులకు ప్రజాకళా కారుడు గద్దర్ పేరిట ప్రతియేటా 'గద్దర్ అవార్డులు' ఇస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందని ప్రకటించార న్నారు. తెలుగు పరిశ్రమ తరఫున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలని కోరుతున్నానంటూ మెగాస్టార్ ట్వీట్ చేశారు. గతంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి సినిమా పరిశ్రమలో నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరిట అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ విషయంపై తాజాగా సీఎం స్పందించారు. రవీంద్రభారతిలో డాక్టర్ సినారె 93వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. గద్దర్ పేరిట అవార్డులు ఇస్తామని ప్రకటించినా చిత్ర పరిశ్రమ తమని స్పందించలేదని పేర్కొన్నారు.దాంతో చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు.

## సీఎం అపాయింట్‌మెంట్ అడిగితే స్పందన లేదు

- తమ్మారెడ్డి భరద్వాజ

**బలగం టీవి, హైదరాబాద్**



నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మార్చుతామని గతంలో సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము సిఎం రేవంత్ రెడ్డి అపాయిం ట్‌మెంట్ కోసం ప్రయత్నించామని రెండు, మూడుసార్లు అపాయింట్‌మెంట్ కోసం అడిగామని కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. సిఎం రేవంత్ అపాయింట్‌మెంట్ ఇస్తే వెళ్లి మాట్లాడటానికి రెడీగా ఉన్నామని ఆయన తెలిపారు. గద్దర్ గొప్ప వ్యక్తి ఆయన పేరుమీద అవార్డులు తీసుకోవడానికి ఎవరికీ అభ్యంతరం లేదని ఆయన ప్రకటించారు.



## యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోస్టర్ ఆవిష్కరించిన సీఎం

**బలగం టీవి, హైదరాబాద్**

%యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ డే సందర్భంగా మంత్రి సీతక్క తో కలిసి యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోస్టర్ ను అసెంబ్లీ ఆవరణలో సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, ప్రజ్వల ఫౌండేషన్ నిర్వహకురాలు సునీతా కృష్ణన్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టులో విచారణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద గౌడ్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొంది.. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌లపై అనర్హత వేటువేయాలని పిటిషన్లు కోరారు. అనర్హత వేటువేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ల తరపున గండ్ర మోహనరావు వాదనలు వినిపించారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కోర్టుకు న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను గండ్ర ప్రస్తావించారు. కోర్టు విచారణను ఆగస్టు ఒకటో తేదీకి వాయిదా వేసింది. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్ బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది.. కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. దాంతో ముగ్గురు ఎమ్మెల్యేలపై అర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరారు. అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంపై హైకోర్టును ఆశ్రయించారు.



# స్కిల్ యూనివర్సిటీ బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు అధునాతన పరిజ్ఞానం అందించడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు అధునాతన పరిజ్ఞానం అందించడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న స్కిల్ యూనివర్సిటీ బిల్లును మంగళవారం ఆయన శాసనసభలో ప్రవేశపెట్టారు. నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఆర్థిక ప్రణాళికల వ్యూహాత్మక పెట్టుబడిగా శ్రీధర్ బాబు అభివర్ణించారు. ఇది ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు కానున్న యూనివర్సిటీగా చెప్పారు. ఈ యూనివర్సిటీ ద్వారా రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధితో పాటు ఉద్యోగ కల్పన దిశగా సర్కారు ముందడుగు వేసిందని మంత్రి చెప్పుకొచ్చారు.



# కాంగ్రెస్‌కు షాక్

- **సొంత గూటికి చేరుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మళ్లీ సొంతగూటికి చేరుకున్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అసెంబ్లీలో కలిసి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతానని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక కేటీఆర్‌ను కలిసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఏడాది జులై 6వ తేదీన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు.

# ఆగస్టులోగా రూ.2 లక్షల రుణ మాఫీ పూర్తి చేస్తాం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయింది.. ఎలా రుణమాఫీ చేస్తారని మాట్లాడారు.. కానీ రైతు సంతోషంగా ఉండాలని 6 మే 2022న వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ప్రయోజనం కాదు.. రైతు ప్రయోజనం ముఖ్యమని పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి అభినందనలు తెలియజేశారు. గత ప్రభుత్వం 60 నెలలు నాలుగు విడతల్లో రూ.లక్ష రుణమాఫీ కూడా పూర్తిచేయలేకపోయారని.. రూ.25వేల కోట్లు కూడా రుణమాఫీ చేయలేకపోయిందన్నారు.

"అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందని కొందరు మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో రుణమాఫీ చేయాల్సిందేనని ప్రణాళికలు రచించాం.. నిధులు సేకరించామన్నారు. నిధుల సమీకరణ చేసి ఇవాళ రెండో విడతలో రూ.6,198 కోట్లు ఆరున్నర లక్షల మందికి మేలు జరిగేలా చేస్తున్నాం.. ఇది మా చిత్తశుద్ధి, ఇది మా నిబద్ధత అని తెలియజేశారు. నెహ్రూ ఆనాడు హరిత విప్లవం తీసుకు వచ్చారు. జై జవాన్, జై కిసాన్ నినాదంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్లింది. పేద రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయకరణ చేశారు. సోనియమ్మ నేతృత్వంలో ఆనాడు ఆహార భద్రత చట్టం తీసుకువచ్చారు. ఆనాడు రూ.72వేల కోట్లు రుణాలు మాఫీ చేసి దేశంలో రైతులను ఆదుకుంది కాంగ్రెస్. అప్పుడు .. ఇప్పుడు ఎప్పుడూ కాంగ్రెస్ రైతు పక్షపాతినే" అని పేర్కొన్నారు.

నెల తిరిగేలోగా 1.5లక్షల వరకు రైతు రుణమాఫీ చేసి మా చిత్తశుద్ధి నిరూపించుకున్నాం. ఆగస్టులోగా రూ.2 లక్షల రుణ మాఫీ పూర్తి చేసి రైతులను రుణ విముక్తులను చేస్తామన్నారు. జూలై, ఆగస్టు నెలలు చరిత్రలో లిఖించదగ్గ నెలలు. దేశ చరిత్రలోనే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ రికార్డు సృష్టించిందన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్దమొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ఆరునెలల్లో ఆర్థిక మంత్రి రూ.43 వేల కోట్లు వడ్డీ చెల్లించారన్నారు. 12 రోజుల్లోనే రుణమాఫీకి 12వేల కోట్లు సేకరించిన ఆర్థిక మంత్రి, వారి సిబ్బందిని అభినందిస్తున్నానని ముగించారు.



# 'రాష్ట్రం పేరు చెప్పకపోతే నిధులు కేటాయించనట్టు కాదు'

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో ఏదైనా రాష్ట్రం పేరు ప్రస్తావించనంత మాత్రాన, ఆ రాష్ట్రానికి కేటాయింపులు జరపనట్లు కాదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఏ రంగానికీ తక్కువ కేటాయింపులు చేయలేదని తెలిపారు. బడ్జెట్‌పై మంగళవారం లోక్‌సభలో సమాధానమిచ్చిన నిర్మల, రెండు రాష్ట్రాలకే అధిక కేటాయింపులు చేశామనడం సరికాదన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థ అని, ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కొవిడ్ మహమ్మారి అనంతర ప్రభావాలను అధిగమించామని వివరించారు. "వరుసగా మూడోసారి ఎన్‌డీఏకు అధికారం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు. ప్రధాని మోదీపై ప్రజలు మరోసారి విశ్వాసం ఉంచి అధికారం ఇచ్చారు. స్థిరత్వం, ప్రజా శ్రేయస్సు విధానాలను తీసుకువస్తున్నాం. వికసిత్ భారత్ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం. నైపుణ్య శిక్షణ, విద్యా రంగానికి బడ్జెట్‌లో అధిక కేటాయింపులు చేశాం. భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోంది. సబ్ కా సాత్– సబ్‌కా వికాస్ స్ఫూర్తితో బడ్జెట్ ప్రవేశపెట్టాం. కొవిడ్ విపత్తు తర్వాత కూడా భారత్ వృద్ధి రేటు సాధించింది. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. బీసీ ప్రధాని కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రధాని మోదీ ప్రతి రాష్ట్రానికి సమప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ బడ్జెట్‌లోనూ అన్ని రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇచ్చారు"

**'ఇప్పుడు ఏం సమాధానం ఇస్తారు?'**

గతంలో యూపీఏ పాలనలో రాష్ట్రాలకు కేటాయింపులను ప్రస్తావించిన నిర్మలా సీతారామన్, విపక్షాల విమర్శలకు దీటుగా జవాబు చెప్పారు. "2009–10 బడ్జెట్‌లో బిహార్, యూపీకి అధికంగా నిధులు కేటాయించారు. నాటి బడ్జెట్‌లో 26 రాష్ట్రాల ఊసేలేదు. 2010–11లో 19 రాష్ట్రాలు, 2011–12లో 15 రాష్ట్రాలు, 2013–14లో 10 రాష్ట్రాలను బడ్జెట్‌లో విస్మరించారు. నాడు రాష్ట్రాలను విస్మరించి ఇప్పుడు మమ్మల్ని విమర్శిస్తున్నారు. రెండు రాష్ట్రాలపై ఆరోపణలు చేస్తున్నవారు దానికేం జవాబిస్తారు" అని చురకలంటించారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగం అనంతరం బడ్జెట్‌కు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# బీజేపీ ఎంపీపై రాహుల్ ఆగ్రహం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ప‌తిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం లోక్ సభలో బిజెపి ఎంపీ అనురాగ్ ఠాకుర్ పై విరుచుకుపడ్డారు. తనను అవమానించారని మండిపడ్డారు. అనురాగ్ ఠాకుర్ "ఎవరికైతే తమ కులం కూడా తెలియదో వారు కుల గణన గురించి మాట్లాడుతున్నారు" అన్నారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ "ఎవరైతే ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వారికి సంబంధించిన సమస్యలు లేవనెత్తుతారో వారిని కించపరుస్తున్నారు" అన్నారు.

"కులం తెలియని వారు కూడా కుల గణన గురించి మాట్లాడుతున్నారు. ఈ సభలోనే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ రిజర్వేషన్‌ను వ్యతిరేకించారని నేను స్పీకర్‌కు గుర్తు చేయాలనుకుంటున్నాను" అని బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ సభలో అన్నారు.

కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన చేపడతామని దేశానికి హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ తన వాగ్దానాన్ని పునరుద్ఘాటించారు. "మీరు ఎంత కావాలనుకుంటే అంతగా నన్ను అవమానించవచ్చు, కానీ మేము పార్లమెంటులో కుల గణనను పాస్ చేస్తాము" అని రాహుల్ గాంధీ అన్నారు. తర్వాత ఠాకూర్ తన వ్యాఖ్యల్లో ఎవరి పేరును ప్రస్తావించలేదని చెప్పారు.

